# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 95 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

06-02-2026 శుక్రవారం వెల : 1 /- పేజీలు : 4


## భూ వివాద కేసులను పరిష్కరించాలి





- రెవెన్యూ మరియు పోలీస్ అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలి
- రెవిన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్

2లో

## ప్రజల ఆరోగ్యానికి, సంక్షేమానికి భరోసా సీఎం సహాయ నిధి

- ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష
- పలాస నియోజకవర్గంలో 20 మందికి రూ. 10.85 లక్షల చెక్కులు పంపిణీ

2లో



## ఉపాధిహామి చట్టం 2005ను పునరుద్ధరించాలి

సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు




నవతరం -శ్రీకాకుళం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి చట్టం 2005 ను పునరుద్దరించాలని లేబర్ కోడ్ లు రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 12న చేయనున్న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి గోవిందరావు జిల్లా కమిటీ సభ్యులు సంగారు లక్ష్మీనారాయణ, పిలుపునిచ్చారు

గ్రామీణ పేదలకు, రైతులకు, కూలీలకు అండగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్దరించాలని,

-మిగతా 2లో

## దేశ వాస్తవిక సమస్యలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

- ఏపీ కి మరోసారి మొండి చేయి
- విభజన హామీలకు మంగళం
- ఉత్తరాంధ్ర పారిశ్రామిక అభివృద్ధి హుష్ కాకి
- ఉత్తరాంధ్ర జన చైతన్య వేదిక కన్వీనర్ సిరిగిరి వరదరాజు



నవతరం -పలాస

దేశంలో మెజార్టీ ప్రజానీకం ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందించవలసిన కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉండడమే కాక, ఈ బడ్జెట్ దేశ వాస్తవిక సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఉత్తరాంధ్ర జన చైతన్య వేదిక కన్వీనర్ , ఎన్ పి సి సి ట్రేడ్ యూనియన్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సిరిగిరి వరదరాజు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన పలాసలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సంస్కరణల ఫలితంగా ప్రజలకు ఉపయోగం జరగకపోగా, నిరుద్యోగం, రైతాంగం, వ్యవసాయ కార్మికులు మరియు అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని గుర్తు చేశారు. ప్రజలకు స్థిరమైన ఆదాయం పెరగకుండా కొనుగోలు శక్తి రాదని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా బడ్జెట్ పరిమాణం పెరిగినప్పటికీ పేదలకు, మధ్యతరగతి ప్రజలకు, శ్రమజీవులకు తగిన కేటాయింపులు జరగలేదన్నారు.

-మిగతా 2లో

## తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్న చంద్రబాబు



- తప్పుడు పోస్టర్లతో ప్రజల మనోభావాలు దెబ్బతీస్తున్న టిడిపి నాయకులు
- టిడిపి నేతలు బందిపోట్లుగా మారారు
- వైఎస్ఆర్సిపి నేతల ఇళ్లపై దాడులు అమానుషం
- డైవర్షన్ పాలిటిక్స్ పేరిట ఎన్నికల హామీల అమలుకు ఎగనామం
- కూటమి సర్కార్ పెద్దలు భక్తులకు క్షమాపణ చెప్పాలి
- వైఎస్ఆర్సిపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ

2లో

## చైన్ స్నాచింగ్ కేసు ఛేదన ముగ్గురు నిందితుల అరెస్టు



నవతరం -శ్రీకాకుళం

జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, అపహరించిన బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివేకానంద గురువారం టౌన్ డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో తెలిపారు. 30-01-2026 వేకువజామున నందగిరిపేట గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మెండ వెంకటరమణ, గుంట ప్రమీల, గుంట జగదీశ్వరరావు (ముగ్గురు మెట్టక్కవలస గ్రామ నివాసులు) చెడు వ్యసనాలకు అలవాటు పడి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు.

నిందితులు గుంట జగదీశ్వరరావుకు చెందిన AP 40 EP 9770 నంబర్ గల కారులో నందగిరిపేటకు చేరుకున్నారు. పిర్యాదిదారు తల్లి ముసలమ్మ నివాసం సమీపంలో కారును నిలిపి, మెండ వెంకటరమణ మరియు గుంట ప్రమీల కారు నుంచి దిగారు. గుంట ప్రమీల ఖాళీ బాటిల్‌తో నీరు అడగగా, ముసలమ్మ ఇంట్లోకి వెళ్లి నీరు ఇచ్చింది. అనంతరం మెండ వెంకటరమణ కూడా నీరు అడగడంతో ముసలమ్మ ఇంట్లోకి వెళ్లిన సమయంలో, ఆమె వెనుకగా లోపలికి వెళ్లి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును లాక్కోవడానికి ప్రయత్నించాడు.

-మిగతా 2లో

## అక్రమాలకు పాల్పడే మిల్లర్‌ల పై కేసు ఖాయం

పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్



నవతరం -శ్రీకాకుళం

లేవీ లో పాల్గొందామ్..ధాన్యం మాయం చేద్దాం.అని భావించే మిల్లర్ ల పై క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఖాయం అని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు.గురువారం నాడు ఆయన మునుగోడు లో మాట్లాడుతూ.. కొందరు మిల్లర్ ల కు కస్టమ్ మిల్లింగ్ రైస్ చేయడం లో ఇష్టా రాజ్యం గా వ్యవహరిస్తూ..తమకు నిభందనలు పట్టవు అన్న చందాన వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు.అలా "మా ఇష్టం మేం ఇలాగే ఉంటాం.ఇలాగే చేస్తాం"అనుకుని బిజినెస్ చేసే మిల్లర్ ల పై కొరడా ఝుళిపించడం ఖాయం అని రఘునందన్ స్పష్టం చేశారు.స్వరమమైతే రెవిన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులు జప్తు చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నదని రఘునందన్ వివరించారు.ఈ మేరకు నిబంధనల్ని మరింత కట్టుదిట్టం చేస్తున్నారని రఘునందన్ చెప్పారు.

ఎడిటోరియల్

# కోతల బడ్జెట్!

సరకు తక్కువ సందడెక్కువ అన్న లోకోక్తి ఊరికే రాలేదు. ఆదివారం నాడు పార్లమెంటులో అదే జరిగింది. అబ్బబ్బబ్బ ఏం నటన, ఏ డైలాగ్స్, ఏం చప్పట్లు.... లోక్‌సభలో 2026-27 బడ్జెట్ గురించి 85 నిమిషాల పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ఉపన్యాసాన్ని ఒక డాక్యుమెంటరీగా ఆస్కార్‌కు పంపితే ప్రథమ బహుమతి రావటం ఖాయం. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అమోఘం, అనితర సాధ్యం అన్నట్లుగా ఉంది. ఇక పోటీబడి బల్లలు చరిచిన ప్రధాని నరేంద్రమోడీతో సహా సహ నటీనటుల తీరుతెన్నులు మరోసారి చూడాల్సిందే తప్ప వర్ణించనలవి కాదు. ఏం గొప్ప బడ్జెట్‌ను ప్రతిపాదించారని ఈ హంగామా? తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలమ్మ ఉపన్యాసాలను ఒక్కసారి వెనక్కు తిరిగి వింటే చెప్పినమాట చెప్పకుండా కొత్త అంశాలను జనం ముందుంచారని చెప్పాలి. ఈ విషయంలో ఆమెకు నరేంద్రమోడీ గురువు. ఆయన అందరికంటే ముదురు. గడచిన పన్నెండేళ్లలో తన అమ్ముల పొదిలోంచి కొత్త అస్త్రాలను ప్రయోగించారు తప్ప ఒకసారి వాడినదాన్ని మరోసారి సంధించలేదు.

ప్రపంచంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో దేశ ఆర్థిక వృద్ధిని ముందుకు తీసుకుపోయేందుకు మూడు కర్తవ్యాలను నిర్దేశించుకున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. ఒకసారి చిల్లు అని మరోసారి దాన్నే తూటు, తొర్ర, కన్నం, బెజ్జం ఇలా ఏడాదికి ఒకపదాన్ని వినియోగించి తిమ్మిని బమ్మిని చేసి మాటల గారడీతో గత బడ్జెట్లన్నింటిలో ఈ సొల్లు కబుర్లు తప్ప వేరే ఏమైనా ఉన్నాయా? మూడు లక్ష్యాలట! ఉత్పాదకత ద్వారా దేశ ఆర్థికవృద్ధి, సామర్థ్యాలను పెంచి అందరి ఆకాంక్షలను నెరవేర్చటం, వనరులు, అవకాశాలను అందరికీ అందుబాటులోకి తెచ్చి 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' తేవటం అని కర్తవ్యభవన్‌లో రూపొందించిన బడ్జెట్‌లో చెప్పారు. పిల్లి నల్లదా తెల్లదా అని కాదు ఎలుకలను పడుతుందా లేదా అన్నదే గీటురాయి. ఏ భవనంలో రూపొందిస్తేనేం దానిలో ఉన్నదేమిటీ అన్నదే లెక్క. మోడీ అధికారానికి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జీడీపీలో వస్తూత్పత్తి వాటా 16 నుంచి 13శాతానికి దిగజారటం తప్ప పెరిగింది లేదు. అయినప్పటికీ పదే పదే అదే మాటలు, ఎవరిని వంచించటానికి ఈ కబుర్లు ? మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా, ఆత్మనిర్భరత కబుర్లు ఇప్పుడు చెప్పటం లేదు. వాటి ఆచరణ బండారం ఎలా ఉందో దేజన్ షిరా సంస్థ తాజాగా వెల్లడించిన నివేదిక బయటపెట్టింది. ఆసియాలో ఉత్పాదకత సూచీ 2026 ప్రకారం పదకొండు దేశాల్లో చైనా ప్రథమ స్థానంలో ఉండగా 2024లో నాలుగో స్థానంలో ఉన్న "మోడీ-భారత్" ఆరవ స్థానానికి పడిపోయింది. ఇంతకాలం చెప్పిన నైపుణ్య వృద్ధి ఒక మేడిపండు, వేల కోట్ల రూపాయలను అక్రమార్కులకు కట్టబెట్టటం తప్ప సాధించింది లేదు. ఇక అందరికీ అవకాశాల గురించి చెప్పుకుంటే సిగ్గుచేటు. నిజంగా అలాంటి పరిస్థితే ఉంటే గత మూడు దశాబ్దాల్లో, ప్రత్యేకించి ఈ దశాబ్ది కాలంలో సంపదల అవసమానత దేశంలో ఎందుకు విపరీతంగా పెరిగినట్లు? అవకాశాలు అంబానీలు, అదానీ, టాటా, బిర్లాల వంటి వారికి తప్ప సామాన్యులకు ఎక్కడ ఉన్నాయి. వంటనూనెలకు అవసరమైన పంటల సాగు చేసేందుకు రైతాంగానికి అవకాశం ఇవ్వరు గానీ అదానీ వంటి కంపెనీల దిగుమతులకు ఎన్నో ప్రోత్సాహకాలు కల్పించటం నిజం కాదా?

బడ్జెట్ అంటే సంపదల పంపిణీ, దాని తీరు చూస్తే పేద, మధ్యతరగతులకు, కార్మిక, రైతులు,వ్యవసాయ కార్మికులు, యువతకు ఒరగబెట్టిందేమీ లేదు. దశాబ్దాలుగా ఒక హక్కుగా ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని దయాదాక్షిణ్యాల మీద ఆధారపడిన ఒక పథకంగా మార్చివేశారు. నూట ఇరవై ఐదు రోజుల పని కల్పిస్తామని కొండంత రాగం తీశారు. అందుకు గాను రూ.2.35లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా 95వేల కోట్లతో మమ అనిపించారు. ఈ మొత్తం కూడా రాష్ట్రాలు అమలు జరిపితేనే ఖర్చవుతుంది తప్ప లేకుంటే తిరిగి వెనక్కే. మోడీ సర్కార్ అప్పుల్లో అభివృద్ధి సాధిస్తున్నది. స్థిర ఆస్తులను సృష్టించే మూలధన కేటాయింపులు 6.3శాతం ఉండగా వడ్డీ చెల్లింపులకు పదిశాతం కేటాయించింది.

## ప్రజల ఆరోగ్యానికి, సంక్షేమానికి భరోసా సీఎం సహాయ నిధి

**నవతరం -పలాస**

పలాస నియోజకవర్గంలోని ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు పలాస శాసనసభ్యురాలు శ్రీమతి గౌతు శిరీష ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అనేది అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ఒక వరం లాంటిదని ఆమె పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో, నియోజకవర్గంలోని 20 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 10,85,655/- విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం నా ప్రథమ కర్తవ్యం. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రతి ఒక్క అర్హుడికి సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాను. ఇది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, మానవతా దృక్పథంతో మనం అందించే భరోసా," అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి గణనీయమైన ఆర్థిక సహాయం అందింది. వీరిలో పిన్నింటి భానుప్రియకు అత్యధికంగా రూ. 1,24,700/, గర్తం సవరయ్యకు రూ. 1,06,055/, మరియు ఎమ్. దేవరాజుకు రూ. 1,01,485/- అందజేశారు. అదేవిధంగా, కొర్రాయి ధర్మారావుకు రూ. 97,767/-, డబ్బీరు సాయికుమార్ పట్నాయక్ (కేరాఫ్ డబ్బిరు లక్ష్మీనారాయణ పట్నాయక్) కు రూ. 79,724/- చెక్కులను పంపిణీ చేశారు.

ఇతర లబ్ధిదారులలో రాపాక హిమావతికు రూ. 62,038/, దువ్వు దాలిబందుకు రూ. 60,000/, ఇప్పిలి విమలకు రూ. 60,000/- సహాయం అందింది. ఇంకా, పుచ్చ సావిత్రమ్మకు రూ. 47,919/, సిద్ధభక్తుల శివకు రూ. 44,587/, బైరి అప్పన్నకు రూ. 41,048/, యలమంచి తిరుపతిరావుకు రూ. 39,883/-, కొండప్ప భానుమతికు రూ. 37,205/, బత్తిని గోపికు రూ. 32,500/, జవ్వాది కీర్తికు రూ. 32,100/, తామాడ సాయి (కేరాఫ్ కాంతమ్మ)కు రూ. 30,000/, నూకల తులసికు రూ. 25,166/-, చొప్పారి భరత్ కుమార్కు రూ. 24,746/-, పుచ్చ ఆనందరావుకు రూ. 20,000/-, మరియు నూకల కాములమ్మకు రూ. 18,732/- చొప్పున చెక్కులను ఎమ్మెల్యే శిరీష అందజేశారు.

ప్రభుత్వం నుండి సకాలంలో అందిన ఈ సహాయానికి లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే శిరీషకు మరియు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డులు, పంచాయతీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ కేసు ఛేదన ముగ్గురు నిందితుల అరెస్టు

మొదటిపేజీ తరువాయి

ముసలమ్మ ప్రతిఘటించడంతో ఆమె బుగ్గపై గుద్ది, బలవంతంగా బంగారు పుస్తెల తాడును తెంపుకొని నిందితులు కారులో పరారయ్యారు. 05-02-2026 మధ్యాహ్నం 12 గంటల సమయంలో అపహరించిన బంగారు పుస్తెల తాడును శ్రీకాకుళంలో అమ్మేందుకు వెళ్తుండగా, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి మార్గమధ్యంలో నిందితులను పట్టుకున్నారు. రూరల్ ఎస్సై ఆధ్వర్యంలో నిందితుల వద్ద నుంచి బంగారు పుస్తెల తాడు, AP 40 EP 9770 నంబర్ గల కారు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

## భూ వివాద కేసులను పరిష్కరించాలి

**నవతరం -శ్రీకాకుళం**

స్థానిక జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లాలో గల ఆర్డీవోలు,ఎమ్మార్వోలు, పోలీస్ అధికారులతో రెవెన్యూ సదస్సు సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ భూ సమస్యల కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన పవర్ ప్రజెంటేషన్ ద్వారా అందించిన వివరాలు పై కలెక్టర్ స్పందిస్తూ రెవిన్యూ మరియు పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ వారిగా భూ వివాద కేసుల వివరాలు తెలుసుకుని ఎక్కడ ఎటువంటి అధికార దుర్వినియోగం జరగరాదని అధికారులు ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తప్పుడు కేసులకు అండదండలు అందించిన వారికి భయం కలిగేలా బైండ్ ఓవర్ కేసుల్లో పూచికత్తుగా ఉన్న మొత్తాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించకూడదని తప్పు చేయాలనే ఉద్దేశం ఉన్నవారికి కేసుల భయం మరియు ఆర్థిక భారం దృష్టికి వచ్చేలా అధికారులు కఠినంగా వ్యవహరించాలని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 292 కేసులు జనవరికి ముందు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గతంలో పోలీసు యంత్రాంగం కంటే రెవెన్యూ యంత్రాంగం దగ్గరే ఇటువంటి కేసులు వివరాలు ఉండేవని, అప్పట్లో నాయుడు కరణం మరియు తలయారి గ్రామాల్లో వివరాల సేకరణలో ముందంజలో ఉండేవారని, ఇప్పటికీ రిటైర్ అయి గ్రామాల్లో ఉన్న నాయుడు, కారణం తదితర వాళ్ల సహాయంతో రెవెన్యూ వ్యవస్థలో మార్పు తీసుకురావాలని అన్నారు. తహసిల్దార్లు, వీఆర్వోలు వివరాల సేకరణలో పోలీసు అధికారులకు తగు సమాచారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, డిఆర్ఓ ఎస్ వి లక్ష్మణమూర్తి, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, పలాస ఆర్డిఓ వెంకటేశ్వరరావు, టెక్కలి ఆర్డిఓ కృష్ణమూర్తి, ఎమ్మార్వోలు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డూ పై దుష్ప్రచారం చేస్తున్న చంద్రబాబు

**నవతరం - మందస**

కూటమి పాలనలో అన్యాయాలపై ప్రశ్నిస్తే దాడులు, కేసులే తప్ప ప్రజల సంక్షేమం గురించి అసలు పట్టించుకోవడంలేదని వైయస్సార్సీపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మరియా రామకృష్ణ ఆరోపించారు. బుధవారం ఆయన మందసలో మాట్లాడుతూ, తిరుమల లడ్డూ లో ఇటువంటి కల్తీ జరగలేదని కోర్టు, సిబిఐ, సిట్ క్లీన్ చీట్ ఇచ్చినా.. కూటమి సర్కార్ పెద్దలతో పాటు నేతలు సైతం అసత్యం ప్రచారాలు చేస్తున్నారని, ఈ విషయంపై వైఎస్ఆర్సిపి రాష్ట్ర నేతలు, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి ప్రశ్నిస్తే, వారిపై తెలుగుదేశం పార్టీ రౌడీలు భౌతిక దాడికి పాల్పడడంతో, వారి నివాసాలపై కూడా విధ్వంసానికి పాల్పడడం చూస్తే, రాష్ట్రంలో భారత రాజ్యాంగానికి బదులుగా నారా లోకేష్ సొంతంగా తయారు చేసుకున్న రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. ఏ అబద్ధాలు అయితే ప్రచారం చేసుకుని ఎన్నికల్లో లబ్ధి పొందారో అదే అబద్ధాలు.. అబద్ధాలని నిర్ధారణ అయిన కూడా కూటమి నేతల్లో మార్పు రాకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుపై ప్రశ్నిస్తే ప్రభుత్వానికి కోపం వస్తుందని, ఆ కోపం ఎలా ఉంటుందంటే మరే నేత హామీల అమలు నిలదీయ కూడదు అన్నంతగా దారుణంగా ఉంటుందన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలతో చెలగాట మాడటం తగదన్నారు. రాజ్యాంగబద్ధమైన కార్యనిర్వాహక పదవుల్లో ఉండి తిరుమల తిరుపతి దేవస్థానాల లడ్డు ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందని బాబు, పవన్ ఆరోపించారని, అయితే కల్తీ లడ్డు ప్రసాదంలో జరగలేదని సిబిఐ సిట్ దర్యాప్తు, ల్యాబ్ నివేదిక వెల్లడించినప్పటికీ, మళ్లీ అబద్ధాలు, అసత్య ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. వీటిని ప్రజల ముందుకు ఉంచకుండా ఆధార రహిత వ్యాఖ్యలు చేయడం వల్ల సామాన్య ప్రజలు, హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కూటమి సర్కార్ పెద్దల అసత్య ప్రచారం కారణంగా భక్తులు, ప్రజలు వర్గాలుగావిడిపోయి, ఆన్ లైన్, ఆఫ్ లైన్ వేదిక గా తీవ్రస్థాయిలో వాగ్వాదాలు, ఘర్షణలు చోటు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ఆటవిక పాలన సాగిస్తున్నారని, టిడిపి నేతలే గుండాలుగా, రౌడీలుగా కర్రలు, కత్తులు, ఇనప రాడ్లు పట్టుకొని వీధుల్లో ప్రజలను భయపెడుతూ సైర విహారం చేస్తున్నారని రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వైయస్ జగన్మోహన్ రెడ్డి మాదిరిగా సంక్షేమ పథకాలు ఇవ్వకపోగా, ప్రశ్నించే వారిపై దాడులకు దిగడం, కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్న గాని కాల్ మనీ కేసులు, మర్డర్లు, అక్రమాలు, భూకబ్జాలు, లైంగిక వేధింపులు దందాలు జరుగుతాయని మడియ రామకృష్ణ విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో వచ్చిన మార్పులు గమనించాలని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు తక్షణం అమలు చేయాలని, రెడ్ బుక్ రాజ్యాంగం కాకుండా, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గౌరవించి మంచి పరిపాలన చేయాలని రామకృష్ణ కూటమి పాలకులకు హితవు పలికారు.

## ఉపాధిహామి చట్టం 2005 ను పునరుద్ధరించాలి

మొదటిపేజీ తరువాయి

విబిజి రామ్ జి పథకం రద్దు చేయాలని కోరుతూ సోంపేట ఎంపిడిఓవీ=ా కార్యాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం,వామపక్ష పార్టీల మద్దతుతో ఆధారపడిన యుపిఎ- 1 ప్రభుత్వం వామపక్ష పార్టీల ఒత్తిడి, కృషితో వచ్చిన 2005 మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం రద్దు చేయడం వలన గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు నష్టమని, పని హక్కు పోతుందని అన్నారు. కార్పొరేట్ల ఒత్తిడితోనే కొత్త చట్టం తెచ్చారనిఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన దుష్ట చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంగారు గుణవతి గార గుణవతి తామడ భాగ్యం చిగురు వలస హేమలత తామడు ఇందిరమ్మ దున్న శ్యామల శివంగి ఈశ్వరి మరలా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

## దేశ వాస్తవిక సమస్యలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

కేంద్ర బడ్జెట్ రూ. 53. లక్షల 47 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించినప్పటికీ, ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్యం కలిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి మరోసారి కేంద్రం మొండి చేయి చూపించిందని ఆయన విమర్శించారు. అలాగే రాష్ట్ర విభజన హామీలకు పంగనామాలు పెట్టిందన్నారు. విభజన చట్టం ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థలకు ఈ బడ్జెట్లో కేటాయింపులు లేకపోవడం, విశాఖ రైల్వే జోన్,కడప ఉక్కు ఫ్యాక్టరీ,గిరిజన యూనివర్సిటీ,సెంట్రల్ యూనివర్సిటీ లకు ఎన్ఐటి.. ఐఐటి.. ఐఐఎం.. ట్రిబుల్ ఐటీ , దుగ్గరాజుపట్నం పోర్ట్, వెనుకబడిన జిల్లాలకు నిధులు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీకి గత బడ్జెట్ లో 8622 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం 3295 కోట్లు కేటాయింపు జరిగిందని, అంటే 5327 కోట్లు బడ్జెట్లో తగ్గించిందని సిరిగిరి వరదరాజు ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఖనిజనిక్షేపాల కారిడార్ పేరుతో అడవులను కొల్లగొట్టి ఆదివాసీలను అక్కడినుంచి గెంటివేయాలని చూస్తుందన్నారు. కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు జాతీయ సంపద దోచి పెట్టే క్రమంలో రోడ్లు, రైళ్లు, రక్షణ రంగం పేరుతో వారికి నిధులు కట్టబెట్టిన తీరు సామ్యవాద స్ఫూర్తి కి విరుద్ధంగా ఉందన్నారు. ఉద్యోగాలు లేవు ఉపాధి లేదు, దేశంలో నిరుద్యోగం తీవ్ర స్థాయికి చేరుకున్న గాని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన ప్రణాళిక లేదన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అవసరమైన మద్దతు లేదని, దీంతో యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టి వేయబడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం, రైతులకు కనీసం మద్దతు ధరకు చట్టబద్ధ హక్కు లేదన్నారు. సాగునీరు, వ్యవసాయ పెట్టుబడులపై తగిన నిధులు లేవని, ఎరువులు, విద్యుత్తు, విత్తనాల ధరల పెరుగుదలపై ఎటువంటి రక్షణ లేదన్నారు. ఈ బడ్జెట్ అన్నదాతలను అప్పుల ఊబిలోకి మరింత నెట్టే విధంగా ఉందన్నారు. రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ అని చంద్రబాబు చెప్పడం తప్ప ఆచరణలో నిధులు కేటాయింపులు లేవన్నారు. ముఖ్యంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ లో ఎటువంటి నిధులు కేటాయించలేదని, ప్రధానంగా ఎన్డీఏ ప్రభుత్వంలో పౌర విమాన యాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు తోపాటు మరి కొంతమంది ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్రంపై నిధులు రప్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందినారని సిరిగిరి వరదరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వచ్చే రాష్ట్ర బడ్జెట్లోనైనా వెనుకబడిన ఉత్తరాంధ్ర లో పర్యావరణానికి హానిలేని పరిశ్రమలు నెలకొల్పే విధంగా ఒక రోడ్ మ్యాప్ రూపొందించాలని ఆయన విన్నవించారు.

# సర్వమంగళ మాంగల్యే.... సప్తపది ఏడడుగులు...

సఖాసప్తపదాభవ అన్నారు. ఇద్దరు ఏడడుగులు కలసి నడిస్తే మిత్రత్వం కల్గుతుందని శాస్త్రం. వరుడు వధువు నడుముపై చేయి వేసి దగ్గరగా తీసుకొని అగ్ని హోత్రమునకు దక్షిణపైఅవున నిలబడి తూర్ప్ దిక్కు వైపుగా ఇద్దరూ ముందుగా కుడి అడుగు పెట్టి ఏడడుగులు నడవాలి. ఒక్కొక్క అడుగుకి ఒక్కొక్క అర్థం వచ్చే మంత్రం ఉన్నది. 1. మొదటి అడుగు: ఏకం ఇషే విష్ణః త్వా అన్వేతు ... ఈ మొదటి అడుగుతో విష్ణువు మనిద్దరినీ ఒక్కటి చేయుగాక. 2. రెండవ అడుగు: 'ద్వే ఊర్జే విష్ణః త్వా అన్వేతు ఈ రెండవ ఆదుగుతో మనిద్దరకు శక్తి లభించు నట్లు చేయు గాక. 3. మూడవ అడుగు: త్రీణి వ్రతాయ విష్ణః త్వా అన్వేతు ఈ మూడవ అడుగు వివాహ వ్రత సిద్ధి కొరకు విష్ణువు అనుగ్రహించు ఘాక. 4. నాల్గవ అడుగు: చత్వారి మయోభవాయ విష్ణః త్వా అన్వేతు ఈ నాలగవ ఆదుగు మనకు ఆనందమును విష్ణువు కలిగించు గాక. 5. ఐదవ అడుగు. పంచ పశుభ్యోవిష్ణ త్వా అన్వేతు ఈ ఐదవ ఆదుగు మనకు పశుసంపదను విష్ణువు కలిగించు గాక. 6. ఆరవ అడుగు. ఋతుభ్యో విష్ణః త్వా అన్వేతు ఈ ఆరవ అడుగు ఆరు ఋతువులు మనకు సుఖమునిచ్చుగాక. 7. ఏడవ అడుగు... సప్తభ్యో హోతాభ్యో విష్ణః ఈ ఏడవ అడుగు గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణకు విష్ణ అనుగ్రహించు గాక

## సర్వమంగళ మాంగల్యే...

మంగళసూత్రం లేదా మాంగళ్యం హిందూ సాంప్రదాయంలో పెళ్ళి జరిగిన స్త్రీలు మెడలో ధరించే గొలుసు లాంటి వస్తువు. దీనిలో తాళి లేదా తాళిబొట్టు, కొన్ని నల్ల పూసలు మొదలైనవి గుచ్చుకుంటారు.

వివాహ సమయం నుండి స్త్రీలు మంగళ సూత్రం ధరించడం భారతీయ సంప్రదాయం. ఈ ఆచారం ఈనాటిది కాదు. పెళ్ళినాడు వరుడు వధువుకు తాళికట్టే సాంప్రదాయం ఆరో శతాబ్దంలోనే ఆరంభమయింది. మంగళ సూత్రం అనే శబ్దం సంస్కృతం నుండి పుట్టింది. సంస్కృతంలో 'మంగళ' అంటే శోభాయమానం, శుభప్రదం అనే అర్ధాలు ఉన్నాయి. సూత్రం అంటే తాడు, ఆధారమైనది అని అర్థాలు ఉన్నాయి. సాధారణంగా మంగళసూత్రాన్ని 108 సన్నని పోగులు, దారాలు కలిపి దానికి పసుపు రాసి తయారు చేస్తారు. ఇలా కలపబడిన తొమ్మిది లేదా పదకొండు కలిపికూడా కొందరు తాళిని తయారు చేస్తారు. మంగళ సూత్రధారణ జరుగునపుడు ఈ మంత్రమును పఠిస్తారు.

"మాంగల్యం తంతునానేనా మమజీవన హేతునా! కంఠే భద్నామి సుభగే త్వం జీవ శరదాం శతం!! "

మంగళ సూత్రము భార్యా భర్తల శాశ్వత సుభంధానికి గుర్తు. అది వైవాహిక జీవితాన్ని సమస్త కీడులనుండి తొలగిస్తుందని హిందువుల నమ్మకం. శక్తి స్వరూపిణి అయిన స్త్రీ మెడలో మంగళ సూత్రము ఉన్నంత వరకూ భర్తకు ఆయుషు ఉంటుందని హిందువులు నమ్ముతారు. అందుకే హిందూ స్త్రీ మంగళ సూత్రము ధరించును.

మంగళసూత్రం ఈ పేరు దీనికి ఎలా వచ్చిందంటే, ఈ సూత్రం ధరించినందువల్ల మానవ జీవితములో అనేక మంగళములు కలుగుతున్నాయి కనక ఈ సూత్రానికి మంగళసూత్రానికి అంటే ఒక సాధారణంగా కనిపించే మామూలు తాడుకు పసుపు పూసి కట్టిన తాడుకు మంగళసూత్రం అని పేరు వచ్చింది. స్త్రీ పురుషులు వివాహము ద్వారా ఒక కుటుంబంగా జీవించడానికి ఇష్టపడి ఈ సూత్రముని ధరించడానికి స్త్రీ దానిని ధరింప చెయ్యడానికి పురుషుడు అంగీకరించి వివాహము ( విశేషమైన వాహము అంటే విశేషమైన జీవన విధానమునకు విశేషమైన జీవనానికి ఆధారము



అవుతున్నది కనక ఇది వివాహము అవుతోంది. మనిషి జీవితంలో ఈ సూత్రం ధరించి ఆ మంగళములను పొందుతున్నారు కనక మంగళ సూత్రం అని పేరు వచ్చింది. ఇక ఈ సూత్రం వల్ల మనుషులకు ఎలాంటి మంగళములు కలుగుతాయి? అనేది అత్యుత్తమైన అసలైన తార్కికమైన ప్రశ్న. అనేక మంది వివాహాన్ని వ్యతిరేకించే వారున్నారు. ఇది ప్రకృతిలోనే అసహజమైన విధానమని వాదించే వారూ వున్నారు. హిందూ వివాహ విధానం లో మాంగల్యధారణే అతి ప్రధానమైనది. మాంగల్య ధారణ చేసే ముందు వారిద్దరూ కలిసి అగ్ని సాక్షిగా ఎన్నో ప్రతిజ్ఞలు చేసి మాంగల్యం మాంగల్యాన్ని స్త్రీ ధరించితే పురుషుడు ఆమె మెడలో కట్టి ధరింప చేస్తాడు. పురుషుడికి వివాహం జరిగినదానికి అతని కి ఉంగరాన్ని కట్టి ఆతను వివాహ దీక్షను తీసుకున్న వాడు అని తెలియచేస్తారు. ఈ పసుపు తాడు ఆధారంగా వైవాహిక జీవితాన్ని ఆరంభిస్తారుకనక అది మంగళ సూత్రం అవుతున్నది. మాంగల్యానికే మంగళసూత్రం, తాళి, తాళిబొట్టు, పుస్తె, శతమానం అనే పేర్లతోబాటూ వివిధ రూపాలు కూడా ఉన్నాయి. మానవులకు మనువాడటం ఎంత ముఖ్యమో, మనువాడటానికి మంగళసూత్రం అంతే ముఖ్యం. మంగళసూత్రంలో పగడం ముత్యం నల్లపూసల ప్రాముఖ్యత: మంగళసూత్రంలో ముత్యం, పగడం ధరింపజేసే సాంప్రదాయం మనది, ఎందుకు? ముత్యం చంద్రగ్రహానికి ప్రతీక, దేహ సౌఖ్యం, సౌందర్యం, మనస్సు, శాంతి, ఆనందములకు అన్యోన్యదాంపత్యములకు కారకుడు, శారీరకంగా నేత్రములు, క్రొవ్వు, గ్రంథులు, సిరలు, ధమనులు, స్తనములు, స్త్రీల గుహ్యావయములు, నరములు, ఇంద్రియములు, గర్భదారణ, ప్రసవములకు కారకుడు.

కుజగ్రహ కారకత్వము: అతికోపం, కలహాలు, మూర్ఖత్వం, సామర్ధ్యము, రోగము, ఋణపీడలు, అగ్ని, విద్యుత్భయములు, పరదూషణ, కామ వాంఛలు, దీర్ఘసౌమాంగల్యము, దృష్టి దోషము యిత్యాదులు, శారీకంగా ఉదరము, రక్తస్రావము, గర్భస్రావము, ఋతుదోషములు నివారించబడతాయి.

భారతీయ సాంప్రదాయ స్త్రీలకు మంగళసూత్రములో ముత్యం మించిన విలువైనది లేనేలేదు, దానికి తోడు జాతిపగడం ధరించడం మన మహర్షులు చెప్పటంలో విశేష గూడార్థమున్నది. అదేమిటంటే..

ముత్యం పగడం ధరించిన పాతతరరం స్త్రీలలో ఆపరేషన్ అనేది అప్పట్లో చాలా అరుదైన విషయం కాని నేటితరం స్త్రీలలో కానుపు ఆపరేషన్ లేనిదే జరగటం సర్వసాధారణమైపోయింది. ముత్యం, పగడం సూర్యుని నుండి వచ్చే కిరణాలలోనుండే ఎరుపు (కుజుడు) తెలుపు (చంద్రుడు) స్వీకరించి స్త్రీ భాగంలోని అన్ని నాడీకేంద్రములను ఉత్తేజపరచి శరీరకంగా, భౌతికంగా ఆ జంటగ్రహాలు స్త్రీలలో వచ్చే నష్టాలను, దోషాలను తొలగిస్తాయని కొన్ని సంప్రదాయాల వారు విశ్వసిస్తారు. కనుక చంద్ర కుజుల కలయిక ప్రతి స్త్రీ జీవితంలో ఎంత ప్రాముఖ్యం వహిస్తాయో అలాగే ముత్యం, పగడం రెండూకూడా కలిపిన మంగళసూత్రం స్త్రీకి అత్యంతశుభఫలితాలు సమకూర్చగలవు.

మరొక విషయమేమిటంటే శుక్రుడు వివాహకారకుడు మాత్రమే, కాని సంసారిక జీవితాన్ని నడిపేవాడు కుజుడేనన్న మాట మరువకూడదు, అందుకే తొలుతగా కుజదోషం ఉన్నదా లేదా అని చూస్తారు. ప్రతి స్త్రీ జీవితంలో ఈ పై చెప్పబడిన మూడు గ్రహాలు వాటి స్థితిగతులు బాగుంటే ఇక జీవితం ఆనందమయమే సుఖదాయకమే..



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# గజరాజు...గ్రామసింహాలు...!



అందుకే...నిందల నిప్పులు కురిసినా...
విద్వేషపు బాణాలు దూసుకొచ్చినా...
భీకర హోరుగాలి నిన్ను వెనక్కి నెట్టినా..
నీ కసిని కృషినే ఆయుధంగా
మలచుకో..!

సాహసమే నీ ఊపిరిగా సాగిపో...
నీ గమ్యం చేరేవరకు పరుగు ఆపకు..
నేడు నిన్ను చూసి మొరిగిన ఆ శు
నకాలే
రేపు నీవు విజేతవైతే నీకు జేజేలు
పలికేలే
విమర్శల విషం చిమ్మిన ఆ విషనాగులే
నీ కీర్తి కిరీటానికి
దాసోహమంటాయిలే...!

ఓ మిత్రమా..! నా ప్రియ నేస్తమా
నువ్వు మరాళానివై (హంసవై)
మనోహరంగా సాగిపోతుంటే...
ఓర్వలేని కాకిలోకం కారుకూతలు
కూస్తుంది..! కలత చెందక సాగిపో..!

నువ్వు గజరాజువై
గంభీరంగా కదులుతుంటే..
వీధి కుక్కలు విరుచుకుపడతాయి...
భయపడక ధైర్యంగా ముందుకు సాగిపో..!

గుర్తుంచుకో..ఆ వికారపుకేకలు వీధివరకే
లక్ష్యం చేరాక....అవన్నీ అరణ్య రోదనలే.!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# అదనపు రుసుంతో పది పరీక్షలకు ఈ నెల 6 నుండి 12 వరకు గడువు

**జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు**

**నవతరం-శ్రీకాకుళం**

అదనపు రుసుంతో పదవ తరగతి పరీక్షలకు ఈ నెల 6 నుండి 12వ తేదీ వరకు గడువు ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు ఒక ప్రకటనలో గురువారం వెల్లడించారు. మార్చి 2026 లో జరుగబోవు ఎస్.ఎస్.సి పరిక్షలకు, పరీక్ష తప్పిన విద్యార్థులు, రెగ్యులర్ విద్యార్థులకు తత్కాల్ స్కీంలో ఒఒఒ.ఎంముజూ.శీతీస్త్ర వెబ్ సైట్ ద్వారా పరిక్షా రుసుము చెల్లించుటకు, నామినల్ రోల్ సంబంధిత పత్రాలతో ఆన్లైన్లో సమర్పించుటకు ప్రధానోపాద్యాయులకు గడువు ఫిబ్రవరి 6వ తేదీ నుండి 12వ తేదీ వరకు అదనగా రూ.1000/-లుతో చెల్లించుటకు డైరెక్టర్, పరీక్షల విభాగం వారు తెలియజేశారు. సంబంధిత పరీక్ష వ్రాయుచున్న విద్యార్థులు ప్రధానోపాద్యాయులం ద్వారా ఈ సదవకాసమును వినియోగించుకోవలసినదిగా ఆయన కోరారు.

# ఆల్ డిజి టెక్‌కు శ్రీ ఆదిత్య డిగ్రీ విద్యార్థులు



**- అత్యధిక ఉద్యోగ అవకాశలు కల్పించటమే లక్ష్యం**
**- కళాశాల ప్రిన్సిపాల్ యన్వి. వేణుగోపాల్**

**నవతరం -శ్రీకాకుళం**

స్థానిక కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థ "ఆల్ డిజి" టెక్ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. కళాశాల ప్రిన్సిపాల్ యన్వి. వేణుగోపాల్ మాట్లాడుతూ ఆల్ డిజి క్యాంపస్ ఇంటర్వ్యూలలో తమ కళాశాల విద్యార్థులు 125 మంది ఎంపికయ్యారని, క్యాంపస్ ఇంటర్వ్యూలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తద్వారా వారు అన్ని ఇంటర్వ్యూలలో ఎంపిక కాగలుగుతున్నారన్నారు. అనంతరం ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రెటరీ సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బిఈవియల్. నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రతి విద్యార్థికి డిగ్రీతోపాటు ఉద్యోగాన్ని కల్పించడమే తమ ధ్యేయంగా, తగిన శిక్షణ ఇస్తున్నామని, ప్రతి విద్యార్థికి డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే క్యాంపస్ ఇంటర్వ్యూ లకు అవసరమైనటువంటి అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వడం ద్వారా క్యాంపస్ ఇంటర్వ్యూ లకు ఎంపిక కాగలుగుతున్నారని తెలిపారు. గత విద్యా సంవత్సరం 15120 ఉద్యోగాలతో తమ ఆదిత్య డిగ్రీ కళాశాలలు రికార్డు స్థాపించాయని, ఈ సంవత్సరం కూడా అత్యధిక ఉద్యోగ అవకాశాలను కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టరు బియస్.చక్రవర్తి, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆర్. రాజు ఆద్యాపక బృందం అభినందనలు తెలిపారు.

# అక్షరాస్యత కేంద్రంలో కలెక్టర్ తనిఖీ



**నవతరం-శ్రీకాకుళం**

మండలంలోని ఫాజిల్ బాగ్ పేటలో నిర్వహిస్తున్న 'అక్షర ఆంధ్ర - ఉల్లాస్' అక్షరాస్యత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యాసకుల అభ్యసన సామర్థ్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు. వాలంటీర్ టీచర్లు బోధిస్తున్న తీరును, అభ్యాసకులు అక్షరాలు రాస్తున్న విధానాన్ని గమనించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. డిజిటల్ పద్ధతిలో బోధన సాగాలని, ఇందుకోసం టీసీఎస్ వీడియో పాఠాలను ప్రదర్శించాలని ఆదేశించారు. మార్చి 29న నిర్వహించనున్న పరీక్షకు అభ్యాసకులందరూ హాజరై, అక్షరాస్యులుగా ఉత్తీర్ణత సాధించాలని కోరారు.

# తహసిల్దార్ కార్యాలయము వద్ద కార్మిక సంఘం ధర్నాం

### సిపిఎం నాయకులు నంబూరు, కొల్లి ఎల్లయ్య




**నవతరం టెక్కలి**

నేడు స్థానిక టెక్కలి మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కొల్లిళఎల్లయ్య మరియు సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు ఆధ్వర్యంలో ధర్నా జరిపారు. ఈ సందర్భంగా టెక్కలి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని యధాతధంగా అమలు జరపాలని ఉప తహాశీల్దార్ రవికుమార్ కు మెమోరండం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య మాట్లాడుతూ మహాత్మాగాంధీ పేరును మార్చడమే కాకుండా చట్టం లోని వివిధ అంశాలను బలహీన పర్చారు. అని కూలీలు హక్కులను హరించేందుకే పాలకులు ప్రయత్నిస్తున్నారు. సంపదనంతా కార్పొరేట్ కంపెనీలుకు అప్పజెప్పుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కొల్లి యల్లయ్య, కె.శ్రీకాంత్, వి.పోలయ్య, బి.బీమారావు, జి.సుబ్రమణ్యం, యు.లక్ష్మణరావు, బి.వాసుదేవరావు, కొల్లి రామారావు,టి.అప్పన్న, సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని వినియోగించుకోండి

### బిజెపి మండల అధ్యక్షులు జర్జాన రాంజీ

**నవతరం-టెక్కలి**




కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు జర్జాన రాంజీ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, స్టవ్ మరియు మొదటి రీఫిల్ సిలిండర్ను అందిస్తుందని అన్నారు.
గ్రామీణ మరియు పేద కుటుంబాలకు ఉచితంగా సురక్షితమైన వంట ఇంధనాన్ని అందించడమే ఉజ్వల గ్యాస్ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పేద కుటుంబానికి చెందిన ఈ పథకానికి 18 ఏళ్ల పైబడిన మహిళలు యొక్క రేషన్ కార్డ్ (బిపిఎల్), రేషన్ కార్డులో ఉన్న సభ్యులు ఆధార్ కార్డులు, బ్యాంకు బుక్కు యొక్క పత్రాలు తొలిసూరుపల్లి రహదారి సమీపంలో ఉన్న బిజెపి కార్యాలయానికి అందజేయాలని, వాటిని పరిశీలించి నిజమైన అర్హులకు ప్రతి ఒక్కరికి ఉచితంగా వంట గ్యాస్ అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. మరిన్ని వివరాలకు క్రింద నెంబర్లకు 8555883164, 8886560424 సంప్రదించవలసినదిగా కోరారు.

# ఆదిత్యుని దర్శించుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్



**నవతరం-శ్రీకాకుళం**

ప్రత్యక్ష దైవం శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని గురువారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖ కమిషనర్ వి.ఆర్. కృష్ణతేజ మైలవర పు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కమిషనర్‌కు, ఆలయ వేద పండితులు వేద మంత్రోచ్ఛారణలతో ఆశీర్వచనా లు అందజేశారు. అనంతరం ఆలయ అధికారు లు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని వారికి బహూకరించారు.
ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు ఆర్థికంగా చేయూత

### గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ బాబా

**నవతరం- పలాస**

నేడు పలాస ఏపీ ఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 28వ రాష్ట్ర మహాసభ ఏప్రిల్ నెలలో ఒంగోలు పట్టణంలో జరగనున్న సందర్భంగా, యూనియన్ సభ్యులకు ఆర్థికంగా చేయూతనివ్వాలని భావించిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ బాబా (పలాస) రూ.10,000/- విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దువ్వాడ శ్రీధర్ బాబా మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ బలోపేతం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తమ వంతు సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ఆయన ఎన్నో సందర్భాలలో శిరిడి



సాయినాధుని పరమ భక్తులైన శ్రీధర్ బాబా సాయినాధుని కరుణాకటాక్షములతో ఎంతోమంది నీ సహాయ సహకారాలతో ఆదుకుంటున్నారని ప్రజలు వారి యొక్క సేవా భావాన్ని కొనియాడారు.

# కేన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి




**నవతరం-శ్రీకాకుళం**

కేన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, బయట తిన్న జంక్ ఫుడ్, నిలువ పదార్థాలు, ప్లాస్టిక్ వినియోగం వంటివి కేన్సర్ కు ప్రధాన కారణాలు అని ప్రముఖ వైద్య నిపుణులు, హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు డాక్టర్ మేడిషెట్టి సత్య స్వరూప్ అన్నారు...
హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేన్సర్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా స్థానికంగా నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కేన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ బి.గౌరీ శంకర్ మాట్లాడుతూ కేన్సర్ జన్యుపరంగా, ఆహారపు అలవాట్లు వలన , వాతావరణ పరిస్థితుల వలన, ప్లాస్టిక్ వినియోగం వలన వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు..
ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, అదే విధంగా వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా సక్రమ ఆహారపు అలవాట్లు ద్వారా క్యాన్సర్ ను నియంత్రించవచ్చు అని ఆయన అన్నారు.
ప్రస్తుతం ఆధునికం వైద్యం వలన కేన్సర్ నియంత్రణకు అవకాశాలు మెరుగుపడ్డాయని డాక్టర్ గౌరీ శంకర్ అన్నారు. సదస్సులో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రభుత్వం కేన్సర్ వెక్సిన్ ను ఉచితంగా అందుబాటులో ఉంచాలని కోరారు.
ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లో క్యాన్సర్ నివారణ మందుల ధరలను గణనీయంగా తగ్గించడం పట్ల సదస్సుకు హాజరైన వారు తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో హర్ష వల్లి లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ కరణం హారిక ప్రసాద్, పూర్వ అధ్యక్షుడు లయన్ వావిల పల్లి జగన్నాథ నాయుడు, పూర్వ జోన్ చైర్మన్ లయన్ కరణం శోభారాణి, కార్యదర్శి లయన్ శత్యవరపు లక్ష్మణ్ , ఉపాధ్యక్షుడు లయన్ తర్లాడ అప్పల నాయుడు, లయన్ మణిశర్మ , లయన్ మజ్జి సుమన్, లయన్ పాలిశెట్టి మధు బాబు , లయన్ రౌతు శ్రీనివాస రావు అధిక సంఖ్యలో మహిళలు విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.

# చట్టాన్ని నిర్వీర్యం చేసే లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

### సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి పి.తేజేశ్వరరావు

**నవతరం-శ్రీకాకుళం**

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని నిర్వీర్యం చేసే లేబర్ కోడ్ లను రద్దు చేయాలని,, అసంఘటితరంగ కార్మికులకు పటిష్టమైన చట్టం అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి పి.తేజేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు తర్ల.లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
భవననిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆదివారంపేటలో నిర్వహించిన సమావేశంలో ఫిబ్రవరి-12న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెలో పనులు బంద్ చేసి కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షలు , జిల్లాలో సుమారు 80 వేల మంది నిర్మాణరంగ కార్మికులు ఉన్నారని, వారు




పోరాడి సాధించుకున్న నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని గత ప్రభుత్వం 2020 సెప్టెంబర్ 7నుండి నిలుపుదల చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు.
ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి అల్లు. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 8న తిరుపతిలో గాండ్ల తెలికుల రాష్ట్ర కార్యనిర్వహాక వర్గ సమావేశం

**నవతరం-శ్రీకాకుళం**

అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశం ఈనెల 8వ తేదీ తిరుపతి జిల్లా తిరుచానూరు లో గల పద్మావతి కన్వెన్షన్ హాల్ నందు నిర్వహించనున్నట్లు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమనాపల్లి లక్ష్మణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జనాభాలో గణనీయంగా ఉన్న గాండ్ల తెలుకలి సామాజిక సంక్షేమానికి ఒక రాష్ట్ర కార్పొరేషన్ ఏర్పాటు అంశంతో పాటు కుల సంక్షేమ అభివృద్ధిపై కూడా కీలక నిర్ణయాలు తీసుకోవడమే కాక రాజ్యాధికారంలో భాగస్వామ్యం అయ్యేందుకు తగ్గట్లుగా కార్యాచరణ రూపొందించే డిక్లరేషన్ పై చర్చించడం జరుగుతుందని కొమనాపల్లి లక్ష్మణ్ ప్రసాద్ స్పష్టం చేశారు. అదేవిధంగా గాండ్ల తెలికుల ఆత్మీయ సంగమం పేరిట ఒక వినూత్న మైన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. “ ఆదర్శ ఉమ్మడి గాండ్ల తెలికుల కుటుంబం” అనే కార్యక్రమం నిర్వహణలో భాగంగా కొన్ని ఉమ్మడి కుటుంబాలను సత్కరించడంతోపాటు, ఈ ఏడాది ఐఐటి, ఎంబిబిఎస్, ఉద్యోగ రంగాలలో అత్యున్నత స్థానాలు పొందిన వారికి సన్మాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు, కార్యనిర్వాహక అధ్యక్షులు నరవ అనంతం, ప్రధాన కార్యదర్శి బుద్ర మధుసూదన్, కోశాధికారి గార్లదిన్నె నాగరాజు, గౌరవ ముఖ్య సలహాదారు గిద్దలూరు ప్రభాకర్ రావు, తిరుపతి జిల్లా అధ్యక్షులు వంజవాకం గురు దశరథన్ ( కాళహస్తి ),



కార్యదర్శి బండారు శ్రీనివాసరావు నేతృత్వంలో జరగనుంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాస్, విశిష్ట అతిథులుగా తమిళనాడుకు చెందిన వాణియర్ పిరవై రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్. పన్నీర్ సెల్వం, తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి( డాలర్) టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్, బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు హాజరు కానున్నారని కె.ఎల్. ప్రసాద్ తెలిపారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**